క్లుప్తంగా

తహసీల్దారుగా ప్రసాద్ బాధ్యతల స్వీకరణ



కొయ్యూరు: తహసీల్దారుగా ఎస్.ఎస్.వి. ప్రసాద్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన పెదబయలు నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ముందుగా కొద్ది రోజుల కిందట ఇక్కడకు డిప్యూటీ తహసీల్దారుగా వచ్చిన కుమారస్వామికి ఇన్‌చార్జి తహసీల్దారు బాధ్యతలు అప్పగించారు. అనంతరం తహసీల్దారుగా నియమించారు. బాధ్యతలు స్వీకరించిన ప్రసాద్ మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు.

వై.రామవరం తహసీల్దారుగా వేణుగోపాల్



వై.రామవరం: స్థానిక తహసీల్దారుగా పి. వేణుగోపాల్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన ఎటపాక మండలం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. స్థానిక కార్యాలయంలో సిబ్బందితో సమావేశమై అందరిని పరిచయం చేసుకున్నారు. మండల ప్రజలకు అందుబాటులో ఉంటూ పారదర్శకంగా సకాలంలో సేవలందించాలని సలహాలు, సూచనలు ఇచ్చారు. ఇంతవరకు పనిచేసిన తహసీల్దారు కె. అనసూయ గోకవరం బదిలీపై వెళ్లారు. డిప్యూటీ తహసీల్దార్ కె. సుధాకరరావు, వీఆర్వోలు, వీఆర్ఏలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చింతపల్లి నూతన ఎస్‌ఐగా వెంకటేశ్వరరావు



చింతపల్లి: నూతన ఎస్సైగా వెంకటేశ్వరరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ ఇక్కడ ఎస్సైగా పనిచేసిన అరుణ్‌కిరణ్ పాడేరులోని ఎస్‌బీ విభాగానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో శ్రీకాకుళం జిల్లా టెక్కలి నుంచి బదిలీపై వచ్చిన వెంకటేశ్వరరావును నియమించారు.

సీనియర్ అసిస్టెంటుగా వెంకటేశ్వరరావు



వై.రామవరం: మండల రెవెన్యూ కార్యాలయ నూతన సీనియర్ అసిస్టెంటుగా గుడ్ల శ్రీనివాస వెంకటేశ్వరరావు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన ఏలేశ్వరం మండలం నుంచి బదిలీపై వై.రామవరం వచ్చారు. ఇంతవరకు సీనియర్ అసిస్టెంటుగా పనిచేసిన ఎ. తాతారెడ్డి తుని మండలానికి బదిలీపై వెళ్లారు.

శస్త్రచికిత్సలకు 30 మంది ఎంపిక



వైద్య శిబిరానికి వచ్చిన హాజరైన ప్రజలు, వైద్యులు

కొయ్యూరు: వైద్యుడు సంపత్‌బాబు ఆధ్వర్యంలో మంగళవారం రాజేంద్రపాలెంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. దాదాపుగా వంద మందికి పరీక్షలు చేశారు. వారిలో 30 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేసి విజయనగరంలో పుష్పగిరి ఆస్పత్రికి తరలించారు. ఆప్తాలమిక్ సహాయకుడు ఎస్.వి. రమణ, సీహెచ్‌వో ప్రశాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

తడి, పొడి చెత్త బుట్టలు పంపిణీ



చెత్త బుట్టలను పంపిణీ చేస్తున్న ఎంపీపీ అనూషాదేవి, జెడ్పీటీసీ బాలయ్యపడాల్, సర్పంచ్ పుష్పలత

చింతపల్లి: చెత్త రహిత గ్రామంగా చింతపల్లిని తీర్చిదిద్దాలనే ధ్యేయంగా అన్ని చర్యలు చేపడుతున్నట్లు సర్పంచ్ దురియా పుష్పలత అన్నారు. మంగళవారం చింతపల్లిలో ఎంపీపీ అనూషాదేవి, జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య పడాల్, ఎంపీడీవో ఆశాజ్యోతితో కలసి తడి, పొడి చెత్త బుట్టలను గ్రామస్తులకు పంపిణీ చేశారు. పంచాయతీ పరిధిలో 3,200 బుట్టలను పంపిణీ చేపడుతున్నట్లు సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, ఎంపీటీసీలు జయలక్ష్మి, నాగలక్ష్మి, కో–ఆప్షన్ సభ్యుడు నాజర్‌వల్లి పాల్గొన్నారు.

కూలేందుకు సిద్ధంగా వసతి గృహం

- శిథిల భవనాల కిందనే భోజనాలు
- బాల, బాలికలకు ఒకే చోట భోజనాల వడ్డన
- భయంభయంగా గడుపుతున్న విద్యార్థులు
- దుస్థితిలో జోలాపుట్టు ఆశ్రమ పాఠశాల వసతి గృహం



శిథిల భవనాల కింద భోజనాలు చేస్తున్న విద్యార్థులు



జోలాపుట్టులో శిథిలావస్థలో బాలుర వసతి గృహం

ముంచంగిపుట్టు: పెచ్చులూడుతున్న శ్లాబ్... పటుత్వం కోల్పోయిన గోడలు.. ఎప్పుడూ కూలిపోతాయో తెలియని భవనాలు.. వాటి కిందనే రోజూ భయం భయంగా విద్యార్థులు భోజనాలు చేయాల్సిన పరిస్థితి. ఇది ముంచంగిపుట్టు మండలం జోలాపుట్టు పంచాయతీలో ప్రభుత్వ గిరిజన సంక్షేమ శాఖ బాలుర వసతి గృహం దుస్థితి. శిథిలావస్థకు చేరుకున్న ఇక్కడ భవనాలను కూల్చేయాలని గతంలోనే ఉన్నతాధికారుల ఆదేశాలు జారీ చేసినా వసతి గృహ నిర్వాహకులు పట్టించుకోవటం లేదు.

దశాబ్దాల క్రితం నిర్మించిన ప్రభుత్వ గిరిజన సంక్షేమ శాఖ బాలుర వసతి గృహం భవనాల స్థితిగతులను ఉన్నతాధికారులు పరిశీలించారు. విద్యార్థులకు ప్రమాదం అని భావించి కూల్చివేయాలని అప్పట్లో ఆదేశాలు జారీ చేశారు. నేటికీ వసతి గృహ నిర్వాహకులు భవనాలను కూల్చకుండా, వాటిలోనే వంటశాలగా వినియోగిస్తున్నారు. రోజూ భోజనాల కోసం వచ్చే విద్యార్థులు శిథిల భవనాల వద్దకే వచ్చి భోజనాలు తీసుకోవడం, అక్కడే తింటున్నారు. కొంతమంది విద్యార్థులు శిథిల భవనాలపై ఎక్కి భోజనాలు చేస్తున్నారు. వసతి గృహ భవనాల కాలం పరిమితం అయిపోవడం, గోడలు బీటలు వారీ ఉండడం, చెదురుమదురుగా వర్షాలు కురవడంతో భవనాలు తడిచి ఉన్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఏ మాత్రం భవనాలు కూలిపోయినా ఊహకు అందని విధంగా భారీ ప్రమాదం జరిగి, ప్రాణనష్టం జరిగేందుకు ఆస్కారం ఉంది.

బాలికలకు, బాలురకు ఒకేచోట భోజనాలు వడ్డన..

గిరిజన సంక్షేమ బాలుర వసతి గృహం వద్దనే బాలురు 120 మందికి, ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఇంగ్లిష్ మీడియం పాఠశాలకు చెందిన 300 మంది బాలికలకు ఒకే చోట భోజనాలు వడ్డిస్తున్నారు. దీనిపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వేరువేరుగా భోజనాలు వడ్డించడం చేయాలని కలెక్టర్, ఐటీడీఏ పీవోల దృష్టికి గతంలో విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానిక ప్రజాప్రతినిధులు తీసుకువెళ్లారు. నేటికీ పరిస్థితిలో మార్పు రాలేదు. భయపడుతూ పాఠశాలలో తమ పిల్లలను ఉంచాల్సి వస్తుందని బాలికల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోలాపుట్టులో శిథిలావస్థలో వసతి గృహం కూల్చివేసి, బాలికలకు, బాలురకు వేర్వేరుగా భోజనాలు అందించాలని, వంటశాలలు నిర్మించాలని కోరుతున్నారు.

వేర్వేరుగా భోజనాలు వడ్డించాలి



జోలాపుట్టు పాఠశాలలో బాలురకు, బాలికలకు వేర్వేరుగా భోజనాలు అందించాలి. ఒకే చోట భోజనాలు పెట్టడం సరికాదు. బాలికల తల్లిదండ్రులు భోజనాలు ఒకే దగ్గర వడ్డించడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శిథిల భవనాల వద్ద విద్యార్థులు భోజనాలు చేయడం వల్ల ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. ఐటీడీఏ పీవో అభిషేక్ దృష్టికి సమస్యలను తీసుకెళ్లాం. వెంటనే శిథిల భవనాలకు కూల్చి వేయాలి.

– సిసా దశరథ్, బాలికల పాఠశాల విద్యా కమిటీ చైర్మన్, జోలాపుట్టు

భవనాలు కూల్చివేసేందుకు చర్యలు

పాఠశాలలో శిథిల భవనాలకు కూల్చివేసేందుకు చర్యలు తీసుకుంటాం. విద్యార్థులు వాటి కింద కూర్చొని భోజనాలు చేయకూడదని ఇప్పటికే నిర్వాహకులకు ఆదేశాలు జారీ చేశాం. త్వరలోనే బాలికలకు, బాలురకు వేరువేరుగా భోజనాలు వండించి, వడ్డించేందుకు చర్యలు తీసుకుంటాం.

– స్వర్ణలత, ఏటీడబ్ల్యూవో, ముంచంగిపుట్టు

ప్రజా సమస్యలు పరిష్కరించడంలో కూటమి విఫలం

అనంతగిరి జెడ్పీటీసీ గంగరాజు



గ్రామాల్లో పర్యటిస్తున్న జెడ్పీటీసీ గంగరాజు

అనంతగిరి(అరకులోయ రూరల్): ప్రజా సమస్యలు పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని అనంతగిరి జెడ్పీటీసీ సభ్యుడు దీసరి గంగరాజు విమర్శించారు. మంగళవారం ఆయన సీపీఎం నాయకులతో కలిసి లంగుపార్తి పంచాయతీలో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండానే వంద రోజుల పాలనపై గ్రామాల్లో కార్యక్రమాలు నిర్వహించడం సిగ్గుచేటన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేయలేదన్నారు. నేటికి సూపర్ సిక్స్ ఊసేలేదన్నారు. పేరుకే జల్ జీవన్ మిషన్ అని ఏ గ్రామంలోనూ చుక్కనీరు అందించడం లేదన్నారు. ప్రజలందరూ కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకంగా పోరాటం చేయాలన్నారు. అనంతరం సీపీఎం శాఖ కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికైన దేముడుకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కిల్లో మొస్య, నాయకులు సన్యాసిరావు, మద్దు, సింహాద్రి, తదితరులు పాల్గొన్నారు.

జీవనజ్యోతి, సురక్ష బీమాలతో భరోసా

ఏపీజీవీ బీఎం సతీష్ కుమార్



మాట్లాడుతున్న బీఎం సతీష్ కుమార్

కొయ్యూరు: ప్రతి ఒక్కరూ పీఎం జీవనజ్యోతి, పీఎం సురక్ష బీమాలను చేయించుకోవాలని కొయ్యూరు గ్రామీణ వికాస బ్యాంకు మేనేజర్ సతీష్‌కుమార్ తెలిపారు. ఆయన మంగళవారం బూదరాళ్ల పంచాయతీ చౌడుపల్లిలో గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేశారు. బీమా మూలంగా కలిగే లాభాలను వివరించారు. ఏడాదికి తక్కువ ప్రీమియంతోనే అనుకోని ఘటనలతో కుటుంబానికి అండగా బీమా నిలుస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ బ్యాంకు ఖాతా కలిగి ఉండాలని కోరారు.

గంజాయితో జీవితాలు నాశనం



మంపలో అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ

కొయ్యూరు: గంజాయి సాగు, అక్రమ రవాణా చేసి జీవితాలను నాశనం చేసుకోవద్దని మంప ఎస్‌ఐ శంకర్రావు సూచించారు. ఆయన మంగళవారం రాత్రి మంపలో గిరిజనులతో సమావేశమై మాట్లాడారు. హెల్మెట్ లేకుండా ప్రయాణం చేయడం మూలంగా ప్రమాదాలు జరిగితే ప్రాణాలు కోల్పోవలసి వస్తుందన్నారు. విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. సారా తయారీకి దూరంగా ఉండాలని కోరారు. ఎవరైనా విద్యుత్ తీగలు అమర్చి అడవి జంతువులను చంపినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం గ్రామస్తులకు సంకల్పం కరపత్రాలను పంపిణీ చేశారు.

గ్రామస్థాయిలో సామాజిక తనిఖీలు ప్రారంభం



అడుగులపుట్టు గ్రామసభలో మాట్లాడుతున్న ఏపీవో చినఅప్పలనాయుడు

పెదబయలు: మండలంలోని మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ. 23 కోట్ల అభివృద్ధి పనులకు సంబంధించి సామాజిక తనిఖీలు చేపడుతున్నట్లు ఏపీవో చిన అప్పలనాయుడు తెలిపారు. ఈ నెల 14వ తేదీ నుంచి గ్రామస్థాయిలో అభివృద్ధి పనులకు సామాజిక తనిఖీ నిర్వహిస్తున్నారన్నారు. తనిఖీ పూర్తయిన పంచాయతీల్లో ఈ నెల 22 నుంచి 25 వరకు గ్రామ పంచాయతీ స్థాయిలో గ్రామసభలు నిర్వహిస్తున్నామన్నారు. ఏడాదిలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి క్షేత్రస్థాయిలో పరిశీలన, గ్రామసభ తర్వాత ఈ నెల 30న ఉపాధి కార్యాలయంలో మండల స్థాయి ప్రజా వేదిక నిర్వహిస్తామన్నారు. మండలంలో ఉపాధి నిధులతో పంచాయతీ రాజ్, గిరిజన సంక్షేమ శాఖ, గ్రామీణ నీటి పారుదల శాఖ, సర్వశిక్ష అభియాన్‌లో చేపట్టిన పనులపై ఆడిట్ జరుగుతుందన్నారు. స్టేట్ రిసోర్స్ పర్సన్ ఒకరు, జిల్లా రిసోర్స్ పర్సన్లు ఏడుగురు, ఇతర సిబ్బంది ఆడిట్ చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమానికి డ్వామా పీడీ, స్థానిక ఎంపీడీవో పూర్ణయ్య ఇతర శాఖల అధికారులు హాజరవుతారన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ నరసింహమూర్తి, ఎస్‌ఐ వినోద్

అడ్డతీగల: సమాజానికి మహమ్మారిలా తయారైన మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సీఐ నరసింహమూర్తి తెలిపారు. మంగళవారం స్థానిక వారపుసంతలో ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గంజాయి పండించడం, అమ్మడం నేరమన్నారు. గిరిజన యువత ముఖ్యంగా అలాంటి కార్యకలాపాల జోలికి పోరాదన్నారు. అటువంటి సమాచారం ఏమైనా ఉంటే పోలీసు శాఖకు తెలియజేయాలన్నారు. సైబర్ క్రైమ్ ఎలా జరుగుతుందో పలు అంశాలను యువతకు వివరించారు. అటవీ భూములతో పాటు ఇతరత్రా వ్యవసాయ భూముల్లో అడవి జంతువుల కోసం కరెంటు ఉచ్చులు అమర్చరాదన్నారు. చట్టరీత్యా అటువంటి చర్యలు నేరమన్నారు. ఎస్‌ఐ వినోద్ పలు అంశాలపై మాట్లాడారు.

ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



ఆధార్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, ఈవోపీఆర్డీ పాపారావు



కె. కోడాపల్లిలో ఆధార్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఈవోపీఆర్డీ డేవిడ్

గూడెంకొత్తవీధి: గ్రామ సచివాలయాల్లో ప్రత్యేకంగా ప్రారంభించిన ఆధార్ నమోదు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు తెలిపారు. మంగళవారం నుంచి గూడెంకొత్తవీధి, రింతాడ, సచివాలయాల్లో ప్రత్యేక ఆధార్ శిబిరాలు ప్రారంభం అయ్యాయి. ఈ శిబిరాల్లో సేవలు ఈ నెల 25 వరకూ లభిస్తాయన్నారు. ఆయా కేంద్రాల్లో ఆధార్‌సేవలపై ఆరా తీశారు. ఈవోపీఆర్డీ పాపారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జి.మాడుగుల: మండలంలో ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఈవోపీఆర్డీ డేవిడ్ తెలిపారు. కె. కోడాపల్లి గ్రామ సచివాలయంలో ఆధార్ కేంద్రాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఇక్కడ ఆధార్ సేవల వివరాలను ఏవీకె ఆపరేటర్ రాధాకృష్ణను అడిగి తెలుసుకున్నారు. సొలభం-1, నుర్మతి గ్రామ సచివాలయాల్లోనూ ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజల ఆధార్ సవరణలు, కొత్త కార్డులు తీయటం, చిన్నచిన్న దిద్దుబాట్లు, లోపాలు సరిచేశారు. ఆధార్ అప్‌డేట్స్, కొత్త కార్డులు నమోదు, ఫోన్ లింకేజీ వంటివి సరిచేసుకోవాలని ఈవోపీఆర్డీ సూచించారు.

లో ఓల్టేజీ సమస్య పరిష్కరించాలని ఆందోళన



గోవాడలో ఆందోళన చేస్తున్న విద్యుత్ వినియోగదారులు

చోడవరం: విద్యుత్ లో ఓల్టేజీ సమస్యతో ఇబ్బంది పడుతున్న వినియోగదారులు చివరికి ధర్నాకు దిగారు. మండలంలో గోవాడ గ్రామంలో పలు ప్రాంతాల్లో కొంత కాలంగా తీవ్ర లో ఓల్టేజీ సమస్య ఉండటంతో గృహోపకరణాలు తరచూ కాలిపోయి మరమ్మతులకు గురవ్వడంతో వినియోగదారులు మంగళవారం ఆందోళన చేశారు. విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులు రావడం వల్ల ఫ్యాన్లు, లైట్లు, ఇతర విద్యుత్ గృహోపకరణాలు కాలిపోతున్నాయని వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణం అధికారులు చర్యలు తీసుకుని లో ఓల్టేజీ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలో గ్రామ ఉప సర్పంచ్ నక్కా త్రివేణి శ్రీనివాసరావు, అర్జునరావు, అప్పారావు, నక్కా లక్ష్మణ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

చింతపల్లి సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ అనూషాదేవి



మాట్లాడుతున్న ఎంపీపీ అనూషాదేవి, పక్కన జెడ్పీటీసీ బాలయ్య, ఎంపీడీవో ఆశాజ్యోతి, వైస్ ఎంపీపీలు వెంగళయ్య, శారద



సర్వసభ్య సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు

చింతపల్లి: అధికారులంతా గిరిజనులకు అందుబాటులో ఉండాలని ఎంపీపీ కోరాబు అనూషాదేవి అన్నారు. ఎంపీడీవో ఆశాజ్యోతి అధ్యక్షతన మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీపీ మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లో సమస్యల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రధానంగా రహదారులు చాలా చోట్ల నిర్మించాల్సి ఉందన్నారు. అధికారిక సమావేశాలు, క్షేత్ర పర్యటనల పేరుతో కొందరు మండల స్థాయి అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండటం లేదన్నారు. కనీసం వారానికి ఒకటి రెండుసార్లయినా ఆయా శాఖల అధికారులు వారి కార్యాలయాల్లో అందుబాటులో ఉండాలని కోరారు. పలు సమస్యలపై మారుమూల గ్రామాల నుంచి గిరిజనులు మండల కేంద్రానికి వచ్చినా అధికారులు అందుబాటులో లేకపోవడంతో వారి సమస్య ఎవరికి చెప్పుకోవాలో అర్థంకాని పరిస్థితి ఎదురవుతుందన్నారు. చింతపల్లి ప్రాంతీయ ఆస్పత్రి కేవలం రిఫరల్‌గా మారిందన్నారు. ప్రతి చిన్న కేసుకు సంబంధించిన రోగులను సైతం ఇక్కడ వైద్యాధికారులు మైదాన ప్రాంతాల ఆస్పత్రులకు రిఫర్ చేస్తున్నారని జెడ్పీటీసీ బాలయ్య అసహనం వ్యక్తం చేశారు. మైదాన ప్రాంతాలకు వెళ్లేందుకు ఒక్కోసారి వారికి అంబులెన్సు సమకూర్చకపోవడంతో బాధిత రోగులంతా తమను ఆశ్రయిస్తున్నారన్నారు. జిల్లా అధికారులతో మాట్లాడి వారికి వాహన సదుపాయాన్ని కల్పించాల్సి వస్తుందన్నారు. ప్రాంతీయ ఆస్పత్రిలో గర్భిణులకు మెరుగైన వైద్య సేవలందటం లేదని చింతపల్లి ఎంపీటీసీ జయలక్ష్మి అన్నారు. దీనిపై ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రభావతిని సభలో ప్రజాప్రతినిధులు ప్రశ్నించారు. వైద్య నిపుణులు కొందరు సెలవుపై వెళ్లారని, మరికొందరిని నియమించాల్సి ఉందన్నారు. దీనివల్లే కొందరు రోగులను రిఫర్ చేస్తున్నామని వివరించారు. తమ్మంగులలో తాగునీరు, రహదారులు, పాఠశాలలు నిర్మించాలని గ్రామ సర్పంచ్ సలిమితి లక్ష్మయ్య అధికారులను కోరారు. సాగునీటి సదుపాయల కల్పనలో అధికారులు చొరవ చూపాలని లోతుగెడ్డ సర్పంచ్ చింతర్ల సునీల్ కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఆశాజ్యోతి, వైస్ ఎంపీపీలు వెంగళయ్య, శారద, ఈవోపీఆర్డీ శ్రీనివాస్, ఎంఈవో ప్రసాద్, హెచ్‌వో కర్ణ, వివిధ శాఖలకు చెందిన ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న ఎస్‌ఐకు సత్కారం

చింతపల్లి: విధి నిర్వహణలో అంకితభావంతో పని చేసి గిరిజనుల మన్ననలు పొందిన ఘనత ఎస్సై అరుణ్‌కిరణ్‌కు దక్కుతుందని చింతపల్లి సీఐ రమేష్ అన్నారు. అల్లూరి జిల్లా కేంద్రంలోని ఎస్‌బీ విభాగానికి బదిలీ అయిన అరుణ్‌కిరణ్‌కు మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో వీడ్కోలు సభ జరిగింది.

200 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం



పాత రామవరంలో సారా బట్టీపై దాడి నిర్వహించిన ఎస్సై భూషణం, సిబ్బంది

గంగవరం: మండలంలో పాత రామవరం శివారులో సారా బట్టీలపై పోలీసు సిబ్బంది దాడి నిర్వహించారు. ఈ దాడిలో 200 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేసినట్లు ఎస్సై డి. భూషణం తెలిపారు. గ్రామానికి చెందిన పాతర అరవరాజు నుంచి పది లీటర్ల సారా స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు.

పీఎం జన్‌మన్ గృహాలకు రూ.6 లక్షలు కేటాయించాలి



మాట్లాడుతున్న కిల్లో సురేంద్ర



లబ్ధిదారులతో మాట్లాడుతున్న బాలదేవ్

పెదబయలు: పీఎం జన్‌మన్ ఇళ్లకు రూ. 5 లక్షలు పెంచాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కిల్లో సురేంద్ర డిమాండ్ చేశారు. మంగళవారం పెదబయలు మండలం అడుగులపుట్టు పంచాయతీ వడ్డేపుట్టు గ్రామాన్ని ఆయన సందర్శించారు. ఒక్కో లబ్ధిదారుకు రూ.2.39 లక్షలు అందిస్తున్నారని, ఇవి ప్రస్తుతం పెరిగిన వస్తువుల ధరలతో చాలడం లేదన్నారు. లోడు ఇసుక రూ.12,500 నుంచి రూ.13,500 వరకు ఉందన్నారు. గిరిజనులు ఇళ్లు నిర్మించుకోవడం కష్టంగా ఉందన్నారు. ప్రభుత్వం ఉచిత ఇసుక అంటూ ప్రకటనతో మోసం చేస్తుందన్నా రు. కిల్లో శరభన్న, గంగాధర్, కె. రాజు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పీఎం జన్‌మన్ ద్వారా మంజూరు చేస్తున్న గృహాలకు రూ.6 లక్షలు కేటాయించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొర్రా త్రినాథ్ డిమాండ్ చేశారు. మండలంలో వనుగుమ్మ పంచాయతీలో మహాసభ నిర్వహించారు. కామ్రేడ్ సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులర్పించారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మాట్లాడుతూ చంద్రబాబు గిరిజనులకు ఇచ్చిన జీవో నంబర్ 3 రద్దు, ప్రత్యేక డీఎస్సీ, వంద శాతం ఉద్యోగులు వంటి హామీలు అమలు చేయాలని, సూపర్ సిక్స్ పథకాలు వంద రోజుల పాలనలో అమలు కావడం లేదని విమర్శించారు. సీపీఎం నేతలు శంకర్‌రావు, డొన్ను, గంగాధర్, విక్రమ్, చండాల్, సంతాన, సాధురాం, గోపాల్ పాల్గొన్నారు.

అరకులోయ రూరల్: పీఎం జన్‌మన్ గృహాలకు కేంద్ర ప్రభుత్వం రూ.5 లక్షలు చెల్లించాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ తెలిపారు. బొండం పంచాయతీ రేగా గ్రామంలో మంగళవారం ఆయన పర్యటించారు. ఉచిత ఇసుక అమలు కావడం లేదన్నారు. ఇసుక రవాణా చార్జీ రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు పెంచారన్నారు. దీంతో జన్‌మన్ గృహాల నిర్మాణం మరింత భారంగా మారిందన్నారు. నాయకులు, లబ్ధిదారులు సుమాన్, రాంబాబు, స్వామి, రాజు, గోపాల్‌రావు పాల్గొన్నారు.

విద్యార్థులకు అరకు ఎమ్మెల్యే బోధన



ఉపాధ్యాయినులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మత్స్యలింగం

హుకుంపేట: మండలంలోని గూడ ప్రభుత్వ బాలిక ఆశ్రమ పాఠశాలలో అరకులోయ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం మంగళవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఇక్కడ నాల్గో తరగతి విద్యార్థినులకు గణితం నేర్పించారు. పదో తరగతి విద్యార్థినుల బోధన గురించి అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు ఏవిధంగా బోధించాలో తన స్వీయ అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని దిశానిర్దేశం చేశారు. అనంతరం వంటగదిలో ఆహార నాణ్యతను పరిశీలించారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

గ్రామాల అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. పూర్తిస్థాయిలో పనులు జరిగే విధంగా కృషి చేయాలన్నారు. పంచాయతీ రాజ్, ట్రైబల్ వెల్ఫేర్ ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడి పనులు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎంఈవో చెల్లయ్య, ఈవోపీఆర్డీ ఈశ్వరరావు, ఎన్ఆర్ఈజీఎస్ అధికారి అప్పలరాజు, లింగమూర్తి అధికారులు పాల్గొన్నారు.